క్లుప్తంగా

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



ఆలయం వద్ద భక్తుల సందడి

దహెగాం: మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో బోనాల సందర్భంగా గత మూడు రోజులుగా మండల కేంద్రంలోని స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి బోనాల పండుగ నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహించిన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముర్కిలొంకలో 'ఉపాధి' పనులు

కెరమెరి: మండలంలోని ముర్కిలొంకలో ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు పార్ధ, ముర్కిలొంకకు చెందిన కుటుంబాలకు ఒకే జాబ్‌కార్డులు ఉండడంతో కొద్ది రోజుల నుంచి ముర్కిలొంక గ్రామస్తులకు ఉపాధి పనులు కల్పించలేదు. ప్రస్తుతం ముర్కిలొంక గ్రామ కుటుంబాలకు వేరు జాబ్ కార్డులు ఇవ్వడంతో పనులు ప్రారంభించారు.

సింగరేణి పాఠశాలను సందర్శించిన తహసీల్దార్



స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలను బుధవారం తహసీల్దార్ జ్యోత్స్న సందర్శించారు. పాఠశాల స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న తరగతులు, పని చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌వి ప్రేంకిరణ్, సీనియర్ ఎస్టేట్స్ అధికారిణి నవనీత, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, హెచ్‌ఎం సంతోష్, పీఈటీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్ నిబంధనలు సడలించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ రీవాల్యుయేషన్ నిబంధనలు సడలించాలని వివేకానంద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుక్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న నిబంధనలతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. విద్యార్థులు రాసిన జవాబుల్లో జీరో మార్కులు వచ్చిన వాటినే పరిగణనలోకి తీసుకొని రీవాల్యుయేషన్ చేసే అవకాశముందని, దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ నిబంధన మార్చాలని డీఐఈవోకు కూడా లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశామన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో గణితం, జంతుశాస్త్రం బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు ఆసక్తి గల వారు ఈ నెల 15లోగా ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గణితం బోధించేవారు ఎమ్మెస్సీ మ్యాథ్స్, బీఈడీ, జువాలజీ బోధించేవారు బీఈడీ చేసి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ.18,200 వేతనం ఉంటుందని తెలిపారు.

బుద్ధ విహారాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి

వాంకిడి: మండలంలోని ఖమాన, కనర్‌గాం, సరాండి, వాంకిడి గ్రామాల్లో బుద్ధ విహారాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహారంను మంత్రి సీతక్క సందర్శించిన సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 'ధమ్మపద' గ్రంథాన్ని మంత్రికి బహూకరించారు. అంబేద్కర్ కమిటీ హాల్లు, బుద్ధ విహారాల నిర్మాణాలకు సంబంధించిన నిధుల మంజూరు విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు ఉప్రె విజయ్, విలాస్, దుర్గం ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఘన స్వాగతం



విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

కెరమెరి: వేసవి సెలవుల తర్వాత బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలంలోని సుర్దాపూర్ పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. అనేక పాఠశాలల్లో తోరణాలు కట్టి అందంగా అలంకరించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫామ్‌లు అందించారు. మొత్తంగా మొదటి రోజు 98 పాఠశాలల్లో 2567 మంది విద్యార్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ఉపాధ్యాయులు వివరించారు.



మెట్టిగూడ పాఠశాలను అలంకరించిన ఉపాధ్యాయులు



రింగన్‌ఘాట్‌లో కొత్త పుస్తకాలను చూపుతున్న విద్యార్థులు



విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

పాఠశాలలు పునఃప్రారంభం

- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. బుధవారం పాఠశాలలు ప్రారంభం అయిన సందర్భంగా మండలంలోని ఇట్యాల ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: బడిబాట కార్యక్రమంలో భాగగా బుధవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అధికారులు, ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఎంపీడీవో వేముల మల్లేశ్ మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర స్వామి, డీఆర్‌పీవో రాజ్‌కుమార్, ఏపీఎం సదానందం, ఎంపీటీసీ బుర్ర రాజ్యలక్ష్మి ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలు పునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేశ్ కుమార్, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పాఠశాల చైర్మన్ సునీత పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్), జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులను మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజేందర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య ఉంటుందన్నారు. కౌన్సిలర్ పిర్సింగుల జైచందర్, కీర్తి రేఖాశ్రీనివాస్, పాఠశాలల చైర్మన్లు సబెరాబేగం, గిరుగుల లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిర్యాణి: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మల్లేశ్

లింగాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల బుధవార పునఃప్రారంభమైన నేపథ్యంలో ఉపాధ్యాయులు పాఠశాలను పచ్చతోరణాలతో అలంకరించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఎంపీవో ఉమర్ షరీఫ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఏపీఎం దేవానంద్, పంచాయతీ కార్యదర్శి రంజిత్ రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు పూలాబాయి పాల్గొన్నారు.

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని, ప్రతీ ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. బుధవారం ఉన్నత పాఠశాలల్లో పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా పాఠ్య పుస్తకా లు, యనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, కెరమెరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఎంపీటీసీ ఇఫ్తేకార్ ఉన్నారు.

పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమైన నేపథ్యంలో వీవో సంఘ మహిళలు కుట్టిన యూనిఫామ్‌లను ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. మండలంలోని 83 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 2176 మంది విద్యార్థులకు ఒక జత దుస్తులు అందించారు. ఎంఎస్‌వో ఆడె ప్రకాశ్, కెరమెరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. మొదటి రోజు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో రమేశ్‌బాబు, ఎంపీవో గంగాసింగ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెజ్జూర్: సర్కారు బడులు పేదలపాలిట వరమని బెజ్జూర్ ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన అన్నారు. బుధవారం బెజ్జూర్ జెడ్పీఎస్‌ఎస్, ఎంపీపీఎస్, ఉర్దూ మీడియం పాఠశాలలతో పాటు అంబేద్కర్‌నగర్, ఎలకపల్లి, చిన్న సిద్దాపూర్, పెద్ద సిద్దాపూర్, రంగాపూర్, నాగులవాయి గ్రామాల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేశారు.



కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

రెబ్బెన: వేసవి సెలవులు ముగియటంతో బుధవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన యూనిఫాం, పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. మండలంలోని పులికుంటకాలనీ పాఠశాలలో ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, రేకులగూడ పాఠశాలలో ఎంఈవో వెంకటేశ్వరస్వామి యూనిఫాం, పుస్తకాలను అందజేశారు.

ఆసిఫాబాద్‌రూరల్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, వీవో అధ్యక్షురాలు స్వరూప అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. మనుకుమార్, సీఆర్‌పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, ఉచిత నోట్, పాఠ్య పుస్తకాలను అందజేశారు.

వాంకిడి: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అర్జుగూడ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు.

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు రాయిల్ల నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి చల్లూరి అశోక్‌లు కోరారు. బుధవారం గోలేటిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్మికులు నంది శేఖర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

ఏరియాలో పని చేస్తున్న సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీతక్కకు ఐఎన్‌టీయూసీ నా యకులు వినతిపత్రం అందజేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ నా యకులు ప్రకాష్‌రావు, నాయకులు సదాశివ్, రాజన్న, మాదవకృష్ణ, చంద్రకుమార్, శ్రీనివాస్, గట్టయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఆసిఫాబాద్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 10న పూణేలోని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ సాంస్కృతిక భవన్‌లో మహాత్మా జ్యోతి బాపూలే జాతీయ అవార్డు అందుకున్న అవుడపు ప్రణయ్‌ను జిల్లా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు లింగయ్య, శ్రీకాంత్, ధర్మయ్య, శ్రీనివాస్, అంజయ్య, తిరుపతి, రాంచందర్, మధుకర్, వేణు, సునీల్, హరీశ్ పాల్గొన్నారు.

సౌకర్యాలు లేక సతమతం

- 3వ ప్లాట్‌ఫాంపై నీడ, మంచినీరు కరువు
- ఇబ్బందుల్లో రైల్వే ప్రయాణికులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మించిన మూడవ ప్లాట్‌ఫాంపై కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్, వరంగల్, కాజీపేట, బల్లార్షా, తదితర ప్రాంతాలకు ప్రతీరోజు వందలాది మంది ప్రయాణికులు పలు రైళ్ల ద్వారా ప్రయాణిస్తుంటారు. మూడవ ప్లాట్‌ఫాంపై కనీసం నీడ కోసం షెడ్లను నిర్మించకపోవడంతో నీడ లేక ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రైలు వచ్చే వరకు సమీపంలోని ఫుట్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన, బ్రిడ్జి కింద, సమీపంలోని చెట్ల నీడన వేచి ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. రైల్వే అధికారులు నిర్మించిన నాలుగు షెడ్లు పెరిగిన రద్దీకి ఏమాత్రం సరిపోవడం లేదు.

మంచినీరు, మరుగుదొడ్లు లేవు..

మంచినీటి వసతి, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు బయట ఉన్న షాపుల్లో నుంచి వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడం కూడా ప్ర యాణికుల పాలిట శాపంలా మారింది. అత్యవసర సమయాల్లో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కాగా ఈజ్‌గాం, భట్‌పల్లి, అందవెల్లి, కాపువాడ త దితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు అవతలివైపు ఉన్న మార్గం గుండా రైల్వేస్టేషన్‌కు వస్తుంటారు. అయితే వీరు రెండు, మొదటి ప్లాట్‌ఫాంలు దాటి వెళ్లి టిక్కెట్లను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మూ డవ ప్లాట్‌ఫాంపై అదనంగా మరో టిక్కెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వేచి ఉన్న ప్రయాణికులు



రైలు కోసం ఫ్లైఓవర్ బ్రిడ్జి నీడలో ఉన్న ప్రయాణికులు

సౌకర్యాలు కల్పించాలి



మూడవ ప్లాట్‌ఫాంపై కనీస సౌకర్యాలు కల్పించేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలి. కనీసం నీడ, మంచినీటి సౌకర్యం లేకపోవడం దారుణం. ప్లాట్‌ఫాం మొత్తానికి నాలుగు షెడ్లు మాత్రమే నిర్మించగా అవి సరిపోవడం లేదు. ప్రయాణికులకు సరిపోయేట్లు షెడ్లను నిర్మించాలి.

– గొడిసెల కార్తీక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

వంతెన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, తదితరులు

- మంత్రి సీతక్క

ఆసిఫాబాద్‌రూరల్: వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మండలంలోని అప్పపల్లి వాగుపై నూతనంగా నిర్మాణం చేపడుతున్న పనులను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. అప్పపల్లి వాగుపై చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీ అభ్యర్థి సుగుణ, కాంగ్రెస్ పార్టీ నియోజవర్గం ఇన్‌చార్జి శ్యాంనాయక్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, నాయకులు బాలేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, నాయకులు మహేశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ముఖ్యం

ఆసిఫాబాద్‌అర్బన్: రాజకీయాలకంటే ప్రజల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించతలపెట్టిన ప్రెస్‌క్లబ్ భవనానికి ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, ఎంపీపీ మల్లిఖార్జున్, ఆత్రం సుగుణతో కలిసి భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాజకీయాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. జిల్లాలో రోడ్డు సౌకర్యం లేని అనేక గ్రామాలు ఉన్నాయని, వాటన్నిటికి మౌలిక వసతులు కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కూడా ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లేష్, కాంగ్రెస్ నాయకులు చరణ్, ఆసిఫ్, శ్యాం, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

'ప్రాణహిత ప్రాజెక్టుతో రైతులకు మేలు'

కౌటాల: ప్రాణహిత ప్రాజెక్టును నిర్మిస్తే ఉత్తర తెలంగాణ రైతాంగానికి మేలు కలుగుతుందని హైదరాబాద్ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం సభ్యులు అన్నారు. బుధవారం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రాణహిత ప్రాజెక్టు పనులు చేపడితే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు గ్రావిటీ ద్వారానే నీటిని తరలించవచ్చని, ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులకు, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజెంటేషన్ ఇస్తామని తెలిపారు. రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ఎస్ఈ భీమయ్య, పుల్లారెడ్డి, శ్రీరాం రెడ్డి, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రఘుమారెడ్డి, వెంకటయ్య, హన్మంతు రెడ్డి, పాత వెంకటరమణ, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



చర్చిస్తున్న హరీశ్‌బాబు, రిటైర్డ్ ఇంజనీర్ల బృందం

మిషన్ భగీరథ నీటి సరఫరా సర్వే

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు వివి, ద గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు ఇంటింటి సర్వే చే పట్టి వివరాలు సేకరించారు. సర్వే తీరును ఎంపీవో ఉమర్‌షరీఫ్ పరి శీలించారు. మండలంలో ని 14 గ్రామపంచాయతీల్లో కొన్ని గ్రామాల్లో నెట్‌వర్క్ లేకపోవడంతో సర్వేకు ఇబ్బందులు తలెత్తాయి. కాగా పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీవో ఉమర్‌షరీఫ్ ఆదేశించారు.



సర్వే పరిశీలిస్తున్న ఎంపీవో ఉమర్‌షరీఫ్